క్లుప్తంగా

అర్జీల విచారణ సత్వరం చేయండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీ కృష్ణ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు పీజీఆర్ఎస్ అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయడంతో పాటు నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. ఇన్‌చార్జి డీటీ సుశీల, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలున్నారు.

ముఖ మంటప నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన రాతి ముఖ మంటప నిర్మాణానికి దాతల నుంచి విరాళాలు విరివిగా అందుతున్నాయి. దానిలో భాగంగా మంగళవారం పట్టణానికి చెందిన వూటుకూరు కృష్ణసుభాన్, ఆయన భార్య ప్రసన్న రాజ్యలక్ష్మి దంపతులు రాతి ముఖ మంటప నిర్మాణానికి రూ.2,30,000 విరాళంగా ఏసీ తిమ్మనాయుడికి అందజేశారు.

బల్లికురవలో 16 రోజుల పండగ




అలంకరణలో శంఖు, చక్రాలు, నామాలు

బల్లికురవ: మండల కేంద్రం బల్లికురవలోని వెంకటేశ్వరస్వామి మందిరంలో 16 రోజుల పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 14వ తేదీ వేద పండితులచే వెంకటేశ్వరస్వామి మందిరంలో శంఖు, చక్రం, నామాలు, పాదాలు ప్రతిష్ఠించిన విషయం విదితమే ప్రతిష్ఠ తదుపరి 16 రోజుల పండగ వేడుకల్లో భాగంగా పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకపూజలు తదుపరి అలంకరణ చేపట్టారు. ఈ వేడుకల్లో గ్రామస్తులంతా పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

సర్వీస్ రూల్స్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

అద్దంకి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సివిల్ సర్వీస్ రూల్స్ సవరణ చట్టం విశ్రాంత ఉద్యోగులకు తీరని నష్టం కలిగిస్తుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అడుసుమల్లి అనంత కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సమావేశం హాలులో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ప్రభుత్వం చేపట్టే పీఆర్సీ నుంచి విశ్రాంత ఉద్యోగులను తొలగించడం అన్యాయమన్నారు. దీనివల్ల విశ్రాంత ఉద్యోగులకు అవస్థలు పడతారన్నారు. ఈ చట్టాని రద్దుచేసి న్యాయం చేయాలని కోరారు. కార్యవర్గ సభ్యులు మక్కెన వెంకటేశ్వర్లు, రఘురామశర్మ, పెండ్యాల అంకయ్య, మోహనరావు, యోగయ్య, బలరాం పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నాయ్.. కాపాడండయ్యా!



నీరందని కొణిదెన ట్యాంకు



జమ్ము, పాచి పెరిగి దుర్గంధాన్ని పంచుతున్న స్టోరేజీ చెరువు



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు, కాలనీవాసులు

- కొణిదెన ఎస్సీ కాలనీలో మంచినీటి కటకట
- రక్షిత నీటి పథకం ఉన్నా.. అందని నీరు
- బోరు నీరు తాగుతూ అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు



ఎస్సీ కాలనీలో చుక్క నీరు రాని బోరు

బల్లికురవ: ప్రభుత్వ నిర్వాకంతో తాగు నీరు అందక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. కొణిదెన ఎస్సీ కాలనీలో ఈ దుస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఎస్సీ కాలనీ కిలోమీటర్ దూరంలో ఉంటుంది. ఇక్కడ 350 కుటుంబాల్లో సుమారు 1500 పైగా జనాభా నివసిస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం 12వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రెండు కోట్ల రూపాయలతో కొణిదెన పంచాయతీలోని గంగపాలెం, పాత మల్లయ్య పాలెం, కొత్త మల్లయ్య పాలెం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలకు నీరందించేలా పథకాన్ని ఏర్పాటు చేశారు. అయితే నాగార్జున సాగర్ కాల్వ నుంచి కొణిదెన పథక స్టోరేజ్ చెరువుకు నీరు చేరే పైపులైన్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో కొణిదెన గ్రామం వరకే నీరు అందుతోంది. దీంతో ఎస్సీ కాలనీవాసులు బోరు నీటినే తాగుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు. వైద్యానికి వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి

ఇటీవల ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో రక్షిత పథకం నుంచి కాలనీకి వచ్చే పైపులైను.. ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన కుళాయిలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కిలోమీటర్ దూరంలో ఉన్న గ్రామంలోకి వెళ్లి నీరు తెచ్చుకుందామనుకున్నా దుర్వాస వస్తోంది. పైగా ఆ నీరు వాడితే దద్దుర్లు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వినతిపత్రం అందజేత

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని కూటమి ప్రభుత్వం ఆర్భాట ప్రకటనలు మినహా ఆచరణలో పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అన్నారు. కొణిదెన ఎస్సీ కాలనీవాసులు పదేళ్లగా మంచినీటికి అవస్థలు పడుతున్నారని. తక్షణమే కాలనీలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో కుళాయిల అమర్చాలని ఎంపీడీఓ కుసుమకుమారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. కాలనీలో ప్రభుత్వ స్థలం కూడా ఉందని అక్కడ ప్రభుత్వ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి గల్లా వెంకటప్పయ్య, ఏఐటీయూసీ కార్యదర్శి నిమ్మల చిన అప్పారావు, గల్లా అంజయ్య, పావులూరు చౌదరి బాబు, ముస్తఫా, నాగూర్ వలి, కాలనీవాసులున్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయండి



ఎస్సీ కాలనీలో 350 పైగా కుటుంబాలవారం నివసిస్తున్నాం. కాలనీలో లభించే బోరు నీటిని తాగుతూ అనారోగ్యం బారిన పడుతున్నాం. తక్షణమే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలి.

– గెల్లా రత్తయ్య

15 ఏళ్లుగా వైద్యశాల చుట్టూ తిరుగుతున్నాం



కాలనీలో లభించే బోరు నీటిని తాగుతూ 15 ఏళ్లుగా వైద్యశాల చుట్టూ తిరుగుతున్నాం. మోకాళ్లు, నడుము, కీళ్ల నొప్పులతో ఏ పని చేయలేకపోతున్నాం. వైద్యానికి వేలకు వేలు ఖర్చు చేస్తున్నాం. ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో మంచినీరు అందించి ఆదుకోండి.

– జెండరాజుపల్లి మాణిక్యం

కారంచేడు హైస్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం



కారంచేడులో పునః ప్రారంభానికి సిద్ధమవుతున్న పాఠశాల

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో గత మూడు సంవత్సరాల నుంచి మూసివేసిన పాఠశాలను ఈ ఏడాది (2025–26) విద్యా సంవత్సరానికి పునః ప్రారంభానికి సిద్ధమవుతోంది. దీంతో గ్రామంలోని ప్రజలంతా తమ బిడ్డలను గ్రామంలో పునః ప్రారంభించనున్న 'యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల'లో విద్యార్థులకు అడ్మిషన్లు తీసుకుంటున్నామని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామానికి చెందిన విద్యా దాతలు, అన్నదమ్ములైన యార్లగడ్డ వెంకన్నచౌదరి, యార్లగడ్డ రంగనాయకులు 1956వ సంవత్సరంలో 'యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ (కం) ఉన్నత పాఠశాల'గా చల్లపల్లి రాజా వారి చేతుల మీదగా ప్రారంభించారు. అనంతరం 1963వ సంవత్సరంలో భవన నిర్మాణాలు చేపట్టి సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఇప్పుడు మరలా యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా పునః ప్రారంభం అవుతుండటంతో ఇప్పటి వరకు గ్రామానికి చెందిన పిల్లలు చీరాల, కుంకలమర్రు, పర్చూరు ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు కొంత మంది దాతల సహకారంతో పాఠశాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 12వ తేదీన పునః ప్రారంభమయ్యే పాఠశాలలో గ్రామస్తులు సహకరించి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పిల్లలకు అవసరమైన అడ్మిషన్లు తీసుకోవాలని ఎంఈఓలతో పాటు, పూర్వవిద్యార్థులు సంఘ సభ్యులు ప్రకటించి, ఇంటిటికీ ప్రచారం చేస్తున్నారు.

బీమా పథకాల్లో చేర్పించండి




బల్లికురవలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న ఏపీఓ

బల్లికురవ: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు పొందిన ప్రతిఒక్కరినీ భారత ప్రభుత్వ బీమా పథకాల్లో చేర్పించాలని ఏపీఓ రమాదేవి కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో 21 గ్రామపంచాయతీలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజనలో 18 నుంచి 50 సంవత్సరాల్లోపు స్త్రీ పురుషులకు సంవత్సరానికి రూ. 436 ప్రీమియం చెల్లిస్తే ఏ కారణం చేతనైన రూ. 2 లక్షలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనలో 18 నుంచి 70 సంవత్సరాల్లోపు స్త్రీ పురుషులకు సంవత్సరానికి రూ. 20 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ. 20 లక్షలు పరిహారం చెల్లిస్తారన్నారు. మండలంలో జాబ్ కార్డు పొందిన 13477 మంది కూలీల చేత ప్రీమియం చెల్లించేలా అవగాహన కల్పించాలని ఏపీఓ ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు.


నేడు పాలిసెట్

అద్దంకి రూరల్: పాలిసెట్ పరీక్ష మంగళవారం అద్దంకిలో మూడు సెంటర్‌లలో 884 మంది విద్యార్థులు అద్దంకిలోని మూడు సెంటర్లలో పాలిసెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. లాజరస్ బాబు మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి రావాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌లను పాలిటెక్నిక్. ఇన్ వెబ్ సైట్‌లో ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్ నంబర్, మొబైల్ నంబర్ ఎంటర్‌చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

పది విద్యార్థులకు అభినందనలు



చినగంజాం: జాహ్నవిని సత్కరించి నగదు బహుమతి అందిస్తున్న గ్రూపు సభ్యులు



ర్యాంకులు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న జెడ్పీటీసీ భాగ్యలక్ష్మి, బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 588 మార్కులు సాధించిన కొక్కిలగడ్డ జాహ్నవిని హెల్ప్‌టూ పూర్ స్వచ్ఛంద గ్రూపు సభ్యులు మంగళవారం సత్కరించారు. పేద కుటుంబంలో పుట్టి తన ప్రతిభతో మంచి మార్కులు సాధించిన ఆమెను గ్రూపు సభ్యులు ఆమెను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో శాలువా కప్పి సత్కరించడంతో పాటు నగదు బహుమతిని అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో జాహ్నవి తండ్రి జగదీష్, హెల్ప్ టూ పూర్ గ్రూపు సభ్యులు నబీషా, అమీర్ జాన్, సిద్ధం నాగమల్లేశ్వరరావు, సురేంద్ర, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: చినగంజాం జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి ముగ్గురు విద్యార్థులను అభినందించారు. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన ముగ్గురు విద్యార్థినులు మాచవరపు సాహితి, జ్ఞానేశ్వరి, సమీరలను జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి మంగళవారం తన స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందనలు తెలియజేయడంతో పాటు సత్కరించారు. ఆమెతో పాటు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి వారికి శాలువాలు కప్పి, నగదు ప్రోత్సాహకాలను అందించి తమ అభినందనలను తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్. నరసింహారావు, వై. రామాంజనేయులు, ఎం. హేమంత్‌కుమార్ రెడ్డి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీఎంజేఏవై సద్వినియోగం చేసుకోండి

వేటపాలెం: ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన ఆరోగ్య సేవలన సద్వినియోగించు కోవాలని వైద్యాధికారి వై. స్వాతి కిరణ్ పేర్కొన్నారు. వేటపాలెం–2, రామన్నపే–2 సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా 70 ఏళ్లు పై బడిన సీనియర్ సిటిజన్లు ఇతర వయస్సుల వారికి పీఎంజేఏవై కార్డుల పంపిణీ క్యాంప్ మంగళవారం నిర్వహించారు. 436 మందికి నూతన కార్డులు జనరేట్ చాశారు. దారిద్ర రేఖ దిగువ ఉన్న కుటుంబాల వారికి సంవత్సరానికి రూ.5 లక్షల విలువ గల వైద్య సేవలను నెట్‌వర్క్ ఆసుపత్రులన్నింటిలో వై సేవలను అందస్తారని తెలిపారు. జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, వీర బ్రహ్మం, డీడీఓ వై. యాకోబు, డాక్టర్ సాయి వైష్ణవి, సూపర్వైజర్ సుధాకర్, మార్తమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో జ్ఞానం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం రెండో రోజు నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ఆటపాటలతో పాటు పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో విద్యార్థులు 14 మంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన కోనంకి కోలలపూడి గ్రామాల మధ్య జరిగింది. హైవే మొబైల్ సిబ్బంది వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా దోగి పర్రు గ్రామానికి చెందిన గుంటుపల్లి భరత్, తన స్నేహితుడు నల్లి బోయిన ప్రవీణ్ యాదవ్ తో కలిసి ద్విచక్ర వాహనంపై ఒంగోలు వైపు నుంచి స్వగ్రామం వెళుతున్నారు. కోలలపూడి క్రాస్ రోడ్డు సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి వస్తున్న ఓ కారు ఢీ కొట్టగా ఇద్దరూ రోడ్డుపై పడ్డారు. సమీపంలో ఉన్న హైవే మొబైల్ సిబ్బంది గాయపడిన ఇద్దరు యువకులను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న హైవే మొబైల్ సిబ్బంది.

బైక్‌ను ఢీ కొట్టిన లారీ



క్షతగాత్రుడు

అద్దంకి: బైక్‌ను లారీ ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని ధర్మవరంలో మంగళవారం జరిగింది. 108 అందించిన సమాచారం మేరకు.. శంఖవరప్పాడు గ్రామానికి చెందిన కొప్పుల సంజీవ్ కుమార్, కొప్పుల రేవంత్ బైక్‌పై ధర్మవరం వెళ్తున్నారు. ఈ క్రమంలో బైకు గ్రామంలోని పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే లారీ ఢీ కొట్టింది. దాంతో ఇరువురు బైకుపై నుంచి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కుంభాభిషేక ఆహ్వాన పత్రికలు సిద్ధం



పత్రికలను సిద్ధం చేస్తున్న మహిళలు

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి క్షేత్రంలో వచ్చే నెల 14 నుంచి 19 వరకు నిర్వహించనున మహా కుంభాభిషేక ఆహ్వాన పత్రికలను దేవాదాయ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. పత్రికలపై చిరునామాలను రాసి, పోస్టల్ కవర్లలో పెట్టేందుకు వివిధ మహిళా మండల సభ్యులు, స్వచ్ఛంద సేవకులు వచ్చి సిద్ధం చేస్తున్నట్లు ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. వైభవోపేతంగా నిర్వహించనున్న కుంభాభిషేక కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోండి



జనరల్ నాలెడ్జ్ అంశాలను వివరిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల అర్బన్: బాల్యం నుంచే పిల్లలను గ్రంథాలయాలకు వెళ్లేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి మంగళవారం అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా చిన్నారులు ప్రతిరోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్, డ్యాన్స్ నేర్చుకోవడం ద్వారా మానసిక వికాసం కలుగుతుందన్నారు. జీకేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జీకే పుస్తకాలను అందించారు. గ్రంథపాలకురాలు డి.ధనమ్మ, 23 మంది విద్యార్థులు హాజరయ్యారు.

రెండో రోజు కొనసాగిన రిలే దీక్షలు



రిలే దీక్షల్లో ఎన్ఎంయూ నాయకులు

చీరాల అర్బన్: ఆర్టీసీ సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద రిలేదీక్షలు మంగళవారం కొనసాగించారు. దీక్షల్లో డి.సుకన్య, పి.భార్గవి, కె.తిక్కన్న, పి.శామ్యూల్ బాబు, ఎస్‌కే బాజీ కూర్చున్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు దీక్షలు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్ వెంటనే అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు ఆపాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు తులసి శ్రీనివాసరావు, రవి, యూనియన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ



మార్టూరులో పంపిణీ చేస్తున్న శరత్ చౌదరి ఇతర ప్రతినిధులు



వీల్ చైర్ అందుకున్న దివ్యాంగునితో క్లబ్ సభ్యులు

వేటపాలెం: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నలుగురు దివ్యాంగులకు వీల్ చైర్లను రోటరీ జిల్లా గవర్నర్ కె. శరత్ చౌదరి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ ద్వారా సమకూర్చిన వీల్ చైర్లను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్ మాట్లాడుతూ హైదరాబ్ జుబ్లీ హిల్స్, పిడుగురాళ్ల రోటరీ క్లబ్స్ సహకారంతో దివ్యాంగులకు వీల్ చైర్లు అందించినట్లు వివరించారు. సేవా కార్యక్రమాల్లో రోటరీ ముందంజలో ఉంటుందని తెలిపారు. బాలకోటి రెడ్డి, విష్ణుబాబు, కార్యదర్శి లక్ష్మణ స్వామి, గొల్లపూడి సీతారాం, కొత్త శ్రీని వాసరావు, బట్ట మోహన్‌రావు, అక్కల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మార్టూరు: విభిన్న ప్రతిభావంతులైన నలుగురికి రోటరీ క్లబ్ 31 50 జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి మంగళవారం మార్టూరులో వీల్ చైర్ లను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక నాగరాజు పల్లి రోడ్డులో గల శ్రీ సాయి మల్లికార్జున రెసిడెన్సి అపార్ట్‌మెంట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నలుగురికి పంపిణీ చేశారు.

రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల, జూబ్లీహిల్స్ వారి షేర్ ప్రాజెక్టు నిధులతో పంపిణీ చేసినట్లు మార్టూరు అధ్యక్ష, కార్యదర్శులు మద్దు మాల కోటేశ్వరరావు, మాదల సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో జీవీ మోహనరావు, శానంపూడి లక్ష్మయ్య, గరిమిడి శ్రీనివాస రావు, అంకమ్మ చౌదరి, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.